నిర్మాణం పూర్తి... చిత్తశుద్ధి నాస్తి!

- రాజకీయ కారణాలతో అభివృద్ధి పనులకు మోకాలడ్డు
- కొన్ని చోట్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని భవనాలు
- కాస్త నిధులు కేటాయిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరం
- కూటమి ప్రభుత్వం తీరు ఇకనైనా మార్చుకోవాలని ప్రజల డిమాండ్



బొల్లవరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, గ్రామ సచివాలయం



← ముప్పాళ్ళలో అర్ధంతరంగా ఆగిపోయిన అంగన్‌వాడీ కేంద్రం

ముప్పాళ్ళ: గాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేశారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. గ్రామాభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమంటూ గ్రామస్థాయిలో వినూత్న మార్పులు చేపట్టారు. రూ. కోట్లతో పలు సర్కారు భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రం నిర్మాణాలు చేపట్టారు. దాతల సాయంతోపాటు అందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఈ నిర్మాణాలను ప్రారంభించి, పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వంలోని అప్పటి టీడీపీ నాయకులు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాలు జరపకూడదంటూ కోర్టును ఆశ్రయించి మోకాలడ్డే ప్రయత్నం చేశారు. దీంతో కొన్ని గ్రామాల్లో నిర్మాణాలన్నీ నిలిచిపోయాయి. పనులు పూర్తయినవి కూడా ప్రారంభానికి నోచుకోలేదు.

మండలంలో ఇలా...

మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు గాను రెండు మినహా అన్ని గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టారు. మాదలలో జనాభా ప్రకారం రెండు వంతున సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లు, రైతు భరోసా కేంద్రాలు మంజూరు అయ్యాయి. అందులో ఒకటి చొప్పున సచివాలయం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం అయ్యాయి. మిగిలిన నిర్మాణాలను కోర్టు ద్వారా అడ్డుకోవటంతో గ్రామ సచివాలయం–2 నిర్మాణం బేస్‌మెంట్ లెవల్‌లోనే నిలిచిపోయింది. మిగిలిన భవనాలు మంజూరుకే పరిమితం అయ్యాయి. ఇరుకుపాలెం గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు శ్లాబ్ లెవల్‌లో నిలిచిపోయాయి. లంకెలకూరపాడు గ్రామంలో గ్రామ సచివాలయం భవన నిర్మాణం పూర్తయినప్పటికీ కోర్టు ఆర్డర్‌తో ప్రారంభానికి నోచుకోలేదు.

దృష్టి పెడితే అందుబాటులోకి..

కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కొద్ది పాటి నిధులు మంజూరు చేస్తే అవి ప్రజలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ముప్పాళ్ళ గ్రామంలో నాడు–నేడు పథకం కింద రూ.13.50 లక్షలతో శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ పేరుతో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు చివరి దశలో ఉన్న సమయంలో ఎన్నికలు రావటంతో నిలిచిపోయాయి. దీంతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే కేంద్రంలో నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నూతన భవనానికి అవసరమైన తలుపులకు కొద్దిపాటి నిధులు కేటాయిస్తే మరో కేంద్రం అందుబాటులోకి వచ్చే వీలుంటుంది. వీటితోపాటు గోళ్ళపాడు, మాదల గ్రామాల్లో మొత్తం రూ.65 లక్షల నాబార్డు నిధులతో 500 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో రైతులు పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. అవీ ప్రారంభానికి నోచుకోలేదు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా....

నిర్మాణాలు పూర్తయ్యే సమయానికి ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో ప్రారంభోత్సవాలు ఆగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లోని భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మందుబాబులకు, జూదం ఆడే వారికి కేంద్రాలయ్యాయి. మండలంలోని బొల్లవరం గ్రామంలో పాఠశాల కాంపౌండ్‌లో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌లు నిర్మించారు. గ్రామ సచివాలయం నిర్మాణం చివరి దశలో ఉండగా, మిగిలిన రెండు పూర్తయ్యాయి. కోర్టు ఆర్డర్‌తో ప్రారంభం నిలిచిపోయింది. గ్రామ సచివాలయం భవనం మందుబాబులకు, జూదరులకు కేంద్రంగా మారిపోయింది. ఆయా గదుల్లో మద్యం సీసాలు, ఖాళీ వాటర్ బాటిళ్లు పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం మెరుగైన సేవలందించేందుకు చేపట్టిన నిర్మాణాలను రాజకీయ కోణంలో అడ్డుకోవటం, ప్రారంభించకపోవటంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరమయ్యాయి. ఇప్పటికైనా కూటమి పాలకులు నిర్మాణాలు ప్రారంభించి, మెరుగైన సేవలందించాలని మండల వాసులు కోరుతున్నారు.

నిర్మాణాలను అడ్డుకోవడం దుర్మార్గం



గ్రామాభివృద్ధిలో భాగంగా స్థానికులకు అవసరమైన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను కూడా రాజకీయ కోణంలో అడ్డుకోవడం దుర్మార్గం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ కోర్టు ఆర్డర్‌తో పనులు నిలిపివేశారు. పూర్తయిన భవనాలు కూడా నిరుపయోగంగా మారాయి. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇకనైనా అందుబాటులోకి తేవాలి.

–ఇంటూరి వీరయ్య, ఇరుకుపాలెం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

పలు అంశాలు కోర్టు పరిధిలో ఉండటంతో పనులు, ప్రారంభోత్సవాలు ఆగిపోయాయి. అలాంటి వాటి ప్రారంభం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి.

–పీజే విలియమ్స్, ఎంపీడీవో, ముప్పాళ్ళ

క్లుప్తంగా

రాయితీ ధరలకు సరకులు అందించాలి



ముప్పాళ్ళ: నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేసేందుకు చౌక దుకాణాల ద్వారా రాయితీపై అందించాలని సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండలంలోని చాగంటివారి పాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కరపత్రాలు శనివారం పంపిణీ చేశారు. 14వ తేదీన మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీపీఎం నాయకులు తొరటి అమర లింగేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార చట్టంతో మార్పులు



సత్తెనపల్లి: న్యాయ సేవాధికార చట్టంతో వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్నాయని ప్యానల్ న్యాయవాది డి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వేద జూనియర్ కళాశాలలో చట్టం ఆవిర్భావం, ఉపయోగాలు, అమలు తీరు గురించి వివరించారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ఆవశ్యకత, లోక్ అదాలత్, ఫ్రీ లిటిగేషన్ తదితర అంశాలపై మాట్లాడారు. ప్యానల్ న్యాయవాది గంటా వెంకట శివ... ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి వాటితో అనర్థాలు తదితర అంశాలపై మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్ షేక్ సుబాని, కళాశాల ఎండీ చింతాడ సూర్య ప్రకాష్, ప్రిన్సిపల్ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ముఖ్యం



క్రోసూరు: క్రోసూరు మండలంలోని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. క్రోసూరు, బయ్యవరం, ఊటుకూరు, విప్పర్ల, అందుకూరు, బాలమర్రు గ్రామాల నుంచి 120 మంది విద్యార్థులు శనివారం స్టేషన్‌కు వచ్చారు. ఎస్‌ఐ కె.నాగేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాలని కోరారు. బాలల హక్కు పరిరక్షణ ఎంతో అవసరం అన్నారు. తర్వాత విద్యార్థులకు అడ్మిస్ట్రేషన్ , కంప్యూటర్ రూమ్ రికార్డ్స్ గది , లాకప్ రూమ్, స్టేషన్ పనితీరు వివరించారు.

వ్యవసాయ విద్యార్థుల పర్యటన



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థినులు శనివారం గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామ అధ్యయనం పటం ఆకట్టుకునేలా వేశారు. గ్రామంలోని వనరులు, పంటలు, రోడ్లు తదితరాలను వివరించేలా పటాన్ని ఏర్పాటు చేశారు. టైం ట్రెండ్, టైం లైన్, సమస్య చెట్టు మొదలైన భాగస్వామ్య పద్ధతులను గ్రామస్థుల ద్వారా తెలుసుకొని పటంలో పొందుపరిచారు. కార్యక్రమంలో విద్యార్థినులు ఎస్.మౌనిక, పి.మంజుశ్రీ, బి.మేధశ్రీ, కె.మహిమ, ఎస్.కావ్య, ఎన్.నందిని, ఆర్.హేమీమ, రైతులు పాల్గొన్నారు.

రచయిత జిగురుకు అభినందనలు



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యాపీఠం ప్రాంతీయ కార్యదర్శి జిగురు ప్రతాపసింహ శాస్త్రి 'ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం' గ్రంథాన్ని రచించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ రచన చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో మంత్రి కందుల దుర్గేష్, రాజానగరం శాసనసభ్యుడు బత్తుల రామకృష్ణలు దీనిని ఆవిష్కరించి, రచయితను సత్కరించారు. ఈ నేపథ్యంలో శనివారం రచయితను పలువురు అభినందించారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

అమరావతి: సీపీఎం కార్యకర్త నందూరి వెంకటేశ్వరరాజుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన ఎండ్రాయి గ్రామంలో ప్రజా సమస్యలపై పనిచేసే వెంకటేశ్వరరాజుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గోరంట్ల నాగ మల్లేశ్వరరావు రాజు, ఆయన కుమారుడు శివనాగేశ్వర్ రాజు, బావమరిది వరప్రసాద్‌లు దాడి చేసినా ఇంతవరకు అరెస్టు చేయలేదన్నారు.

14 నుంచి ఇంటింటి సర్వే

రాజుపాలెం : క్యాన్సర్ నిర్మూలనకు ఈ నెల 14 వ తేదీ నుంచి ఇంటింటి సర్వే నిర్వహించేందుకు ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు శనివారం శిక్షణ కార్యక్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. డాక్టర్ కృష్ణ కుమారి మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఉన్న అనుమానితులను గుర్తించాలన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనుమానితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలన్నారు. సర్వేలో రోజుకు గ్రామంలో 20 ఇళ్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలో ఆదివారం రెండు ఆలయాలలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. గ్రామంలోని యాదవుల బజారులో శ్రీకృష్ణ దేవాలయం, ప్రధాన సెంటర్ వద్ద సీతారాముల ఆలయాలలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బెల్లంకొండ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు అధ్వానం... ప్రయాణం నరకం



ఓవర్ బ్రిడ్జిపై ముళ్ల కంచెలు



రహదారిపై గుంతలు

రాజుపాలెం: మాచర్ల – గుంటూరు రహదారిలో కొండమోడు నుంచి సత్తెనపల్లి వరకు ప్రయాణించాలంటే వాహనదారులు వణికి పోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాపోతున్నారు. అనుపాలెం సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఓవర్ బ్రిడ్జి ఉంది. దీనికి ఇరువైపులా పెద్ద చెట్లు పెరిగాయి. ముళ్లకంచెలతో రోడ్డు మూసుకుపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి మధ్యలో డివైడర్‌పైనా చెట్లు పెరిగాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే తదితరులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించాలి


సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు శనివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన చాలా మంది గొప్పవారిగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు రాణించాలని సూచించారు. 2013 నుంచి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ట్రస్ట్ సేవల్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతం చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12న పడవలు, బల్లకట్టు నిర్వహణకు వేలం

అచ్చంపేట: మండల సరిహద్దులోని కృష్ణానదిపై 2024–2025 ఆర్థిక సంవత్సరానికిగాను బల్లకట్టు, పడవలు నడుపుకునే హక్కులు పొందేందుకు ఈనెల 12వ తేదీన గుంటూరు జిల్లాపరిషత్ హాలులో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటల కాలం ఈనెల 11వ తేదీ నుంచి, మార్చి 31, 2025 వరకు ఉంటుందన్నారు. అచ్చంపేట మండలంలోని మాదిపాడు కృష్ణానదిపై నుంచి, తెలంగాణా రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, బొగ్గమాదారం వరకు బల్లకట్టు నడుపుకునేందుకు అప్‌సెట్ ప్రైస్ రూ.11.33 లక్షలుగా నిర్ణయించారు. పడవలు నడుపుకునేందుకు గింజుపల్లి నుంచి ఎన్టీఆర్ జిల్లా వేదాద్రి వరకు రూ.1.30 లక్షలు, మాదిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వరకు రూ.13.25 లక్షలు, చామర్రు నుంచి కాసరబాదకు రూ.2.76 లక్షలు, చింతపల్లి నుంచి ఇస్త్రేపల్లి వరకు రూ.2.20 లక్షలు అప్‌సెట్‌ప్రైస్‌గా నిర్ణయించినట్లు చెప్పారు. ఇప్పటికి మూడుసార్లు బహిరంగ వేలం నిర్వహింగా, ఎవ్వరూ రాకపోవడంతో వాయిదాలు వేస్తూ వచ్చామన్నారు. ఇది నాల్గవసారిగా పేర్కొన్నారు. పాటదారులు తమ పూర్తిచేసిన టెండర్లను ఈనెల 12, మధ్యాహ్నం 2 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. అదేరోజు టెండర్లను ఓపెన్‌చేసి హక్కుదారులను ప్రకటించడం జరుగుతుందన్నారు.

మానసికంగా వేధిస్తున్నారు

సూసైడ్ లెటర్ రాసుకున్న విద్యుత్ సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్



లాగ్ బుక్‌లో ఆత్మహత్య రాత

కారెంపూడి: మండలంలోని గాదెవారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఎ.వెంకట కాశీరావు కార్యాలయ రిజిస్టర్‌లో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొంటూ రాసిన లెటర్ ఆలస్యంగా వెలుగు చూసింది. గత 7వ తేదీన కాశీరావు లాగ్ బుక్ (డైలీ దిన చర్య) బుక్‌లో రాసిన ఉత్తరం ఇది శనివారం వెలుగు చూసింది. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తనను ఉద్యోగం మానేయాలని ఏడీఈ, సెక్షన్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఎల్‌డీసీ వేధిస్తున్నారని అందులో పేర్కొన్నారు. పై అధికారులు తనను మానసికంగా వేధిస్తున్నారనీ, తన పొట్ట కొట్టి నన్ను ఒంటరివాడిని చేయొద్దని, నాకు ఏమైనా జరిగితే దానికి వారిదే బాధ్యతని పేర్కొన్నారు. పై అధికారులు న్యాయం చేయాలని కోరాడు. వెంకటకాశీరావు ప్రకాశం జిల్లా కంభంకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. అయితే అతన్ని ఎందుకు తప్పించాలనుకుంటున్నారు దీనికి కారణాలేమిటనేది తెలియాల్సి ఉంది.

ఓటు నమోదుకు 36 దరఖాస్తులు



సత్తెనపల్లి: నియోజకవర్గ పరిధిలోని 274 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025 కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు నిర్వహించారు. మొత్తం 36 దరఖాస్తులు వచ్చాయి. సత్తెనపల్లి మండలం కంటెపూడిలోని 1, 2; నందిగామలోని 11, 12, 13, 14, 15, 16 పోలింగ్ కేంద్రాలను సత్తెనపల్లి తహసీల్దార్ కె.శ్రీనివాస చక్రవర్తి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆదివారం కూడా శిబిరాలు కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఎల్వోలు, బీఎల్ఏలు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

లింకు క్లిక్ చేస్తే ఖాతాలోని రూ. 63 వేలు మాయం

సత్తెనపల్లి: వాట్సాప్‌లో వచ్చిన లింకు క్లిక్ చేయడంతో రూ. 63 వేలు సొమ్ము మాయమైన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సిమెంట్ వ్యాపారి ఆరేపల్లి వంశీకృష్ణకు వాట్సాప్‌లో లింకు రావడంతో దానిని క్లిక్ చేశాడు. వెంటనే అతని బ్యాంకు ఖాతా నుంచి రూ. 63 వేలు సొమ్ము మాయమయ్యాయి. దీంతో బాధితుడు వంశీకృష్ణ పట్టణ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా .. వారు విచారిస్తున్నారు. లింకు పంపి సైబర్ నేరగాళ్లు సొమ్ము మాయం చేస్తారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

బాలల హక్కుల పరిరక్షణ ముఖ్యం

క్రోసూరు: క్రోసూరు మండలంలోని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. క్రోసూరు, బయ్యవరం, ఊటుకూరు, విప్పర్ల, అందుకూరు, బాలమర్రు గ్రామాల నుంచి 120 మంది విద్యార్థులు శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఎస్‌ఐ కె.నాగేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాలని కోరారు. బాలల హక్కు పరిరక్షణ ఎంతో అవసరం అన్నారు. తర్వాత విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో పనితీరును వివరించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మాచర్ల: జాతీయ న్యాయ సేవా దినోత్సవం మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో మాచర్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాచర్ల ప్రభుత్వ న్యాయవాది జీవీ పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భవిష్యత్తులో చట్టాల గురించి సామాన్య ప్రజానీకానికి తెలియ చెప్పాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఉచిత న్యాయం కోసం కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. సీనియర్ న్యాయవాది గంగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావంతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మండల న్యాయ సేవా కమిటీ సభ్యుడు, శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, భవిష్యత్తులో సమస్యలను ఎలా ఎదుర్కోవాలనేది విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు పెంపొందించుకొని క్రమశిక్షణ, దేశభక్తితో పేద ప్రజల కోసం, సమాజం కోసం, దేశం కోసం సేవ చేస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తిక పూజలు



వడ్డవల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వర స్వామి, అమ్మవార్లు



బెల్లంకొండలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని శ్రీ ననారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వడ్డవల్లిలోని శ్రీరామాలయం, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వేస్టేషన్ రోడ్‌లోని శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రవణా నక్షత్రం రోజు కావడంతో ఈ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు కార్తిక దీపాలను వెలిగించి, పూజల్లో పాల్గొన్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బెల్లంకొండ: కార్తిక మాసం సందర్భంగా శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం కొండపై నున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భుక్యా గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో అర్చకులు యువ కిశోరాచార్యులు పంచామృత అభిషేకాలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలోనూ శనివారం పూజలు అత్యంత ఘనంగా జరిగాయి.

నేడు కార్తిక దీపోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి గోశాలలో నరసరావుపేట ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో శ్రీ శ్రీ దామోదర కార్తిక దీపోత్సవం ఆదివారం జరగనుంది. సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ భక్త బృందం శనివారం తెలిపింది.

రెండు చోట్ల త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



కంటెపూడి సమీపంలో పడిపోయిన వాహనం



కంటెపూడి సమీపంలో దెబ్బతిన్న కారు ముందుభాగం

సత్తెనపల్లి: ప్రమాదాలలో ప్రాణాపాయం త్రుటిలో తప్పింది. సత్తెనపల్లి రూరల్ మండలంలో శనివారం ఈ ఘటనలు ఇవి చోటుచేసుకున్నాయి. సత్తెనపల్లి మండలం కంటెపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాల వద్ద కారు, బొలేరో వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బొలేరో పూర్తిగా పడిపోగా, కారు ముందు భాగం దెబ్బతింది. ఇరువురికి స్వల్ప గాయాలు కావడంతో వెంటనే వైద్యశాలకు తరలించారు. అలాగే సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల నుంచి ముప్పాళ్ళ మండలం తొండపికి ప్రయాణికులతో వెళుతున్న ఆటో తిరగడటంతో డ్రైవర్ తలకు గాయాలయ్యాయి. డ్రైవర్‌ను ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.